క్లుప్తంగా

బంటుమిల్లి కోర్టు ఇన్‌చార్జ్ ఏజీపీగా నీరజ నియామకం



గన్నవరం: జిల్లాలోని బంటుమిల్లిలో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్‌చార్జ్ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా గన్నవరం ఏజీపీ ఎన్‌టీజీ నీరజ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్ డీకే బాలాజీ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం గన్నవరం, ఉయ్యూరు కోర్టులో నీరజ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో బంటుమిల్లి కోర్టు ఏజీపీగా ఆమెకు ప్రభుత్వం అదనపు బాధ్యతలను అప్పగించింది. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఆమె బంటుమిల్లి కోర్టులో ఇన్‌చార్జ్ ఏజీపీగా కొనసాగుతారని జిల్లా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

300 మందికి ఉచిత వైద్య సేవలు




పెనమలూరు: పెనమలూరు పల్లిపేటలో సోమవారం 300 మంది పేదలకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. పల్లిపేట మిత్ర బృందం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా 300 మందికి ఉచితంగా బీపీ, షుగర్, కిడ్నీ, ఉచిత రక్త పరీక్షలు చేశారు. భక్తుల సౌకర్యార్థం వైద్య శిబిరం నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

ఉద్యోగ విరమణ చేసిన హెచ్‌ఎంకు ఘనంగా వీడ్కోలు



గన్నవరం: స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో సోమవారం ప్రధానోపాధ్యాయురాలు దుగ్గిరాల ఝాన్సీరాణి ఉద్యోగ విరమణను పురస్కరించుకుని వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఝాన్సీరాణి దంపతులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, బంధుమిత్రులు ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఈఓ కొండా రవికుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో 40 ఏళ్ల పాటు ఝాన్సీరాణి అంకితభావంతో పనిచేశారని చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి ఝాన్సీలక్ష్మి వన్నె తెచ్చారన్నారు. ఉంగుటూరు, గొల్లనపల్లి హెచ్‌ఎంలు సిహెచ్ అనిత, కేఎస్ జగదీశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



రామవరప్పాడు: కూటమి ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్లు అందజేస్తుందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో సోమవారం ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం నెహ్రూనగర్‌లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంబాపురం రహదారి

- అడుగడుగునా గోతులమయం
- అవస్థలు పడుతున్న ప్రజానీకం
- పట్టించుకోని పాలకులు
- గోతులు పూడ్చించమంటున్న స్థానికులు

విజయవాడరూరల్: అంబాపురం-రాజీవ్‌నగర్ రోడ్డు అధ్వాంతం గోతుల మయంగా ఉంది. ఆ రోడ్డుపై నడవాలంటే సర్కస్‌ఫీట్లు చేయాల్సి రావడంతో గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. అంబాపురం, పి.నైనవరం గ్రామాల రైతులు తమ వ్యవసాయ పొలాలకు నిత్యం ఇటుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఖరీఫ్ సీజన్, రబీ సీజన్లలో పంట పొలాల్లో దుక్కులు దున్నడం దగ్గర నుంచి విత్తనాలు తీసుకెళ్లడం, నారుమళ్లు పోసుకోవడం, వరినాట్లకు అవసరమైన ఎరువులు తీసుకెళ్లడానికి ఇదే ఏకైక మార్గం కావడంతో ఆ గుంతల రోడ్డులోనే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పొలాల్లో పనులకు వెళ్లే కూలీలు సైతం వారు కూడా గుంతల్లో నడుచుకుంటూ వెళ్లి రావాలంటే చుక్కలు కనబడుతున్నాయంటున్నారు. అడుగు తీసి అడుగు వేయాలంటే బురద గొయ్యిలే. విజయవాడ ఆటోనగర్ ఇండస్ట్రీస్‌కి వివిధ పనులకు వెళ్లే కార్మికులు, రామవరప్పాడు, ప్రసాదంపాడులోని వివిధ కంపెనీలలో పనికి వెళ్లే వారితో పాటు విజయవాడ నగరంలో 63,64వ డివిజన్లకు వివిధ పనులపై వెళ్లేవారికి ఇదే దగ్గర మార్గం. రోడ్డు దారుణంగా ఉండడంతో ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు జారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పుకోవాలంటే కష్టసాధ్యంగా వుందని గ్రామస్తులు అంటున్నారు.



గోతుల మయంగా ఉన్న అంబాపురం రోడ్డు

ఇదే మార్గంలో ఎస్సీల శ్మశానవాటిక

ఇదే రోడ్డులో అంబాపురం ఎస్సీలకు శ్మశానవాటిక వుండటంతో ఎస్సీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే ఆ బురద రోడ్డు లోనే చనిపోయిన వారిని చెక్క పెట్టిలో పెట్టి మోసుకుని వెళ్లడం కష్టసాధ్యమవుతోందని గ్రామంలోని ఎస్సీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయే వారికోసం సమాధి చేసేందుకు తీసే గోతిలో కూడా నీరు ఊరుతుండటంతో ఆ మురుగు నీటిలోనే సమాధి చేసే కార్యక్రమాలను నిర్వహించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వానికి ఎన్ని దఫాలు విజ్ఞప్తి చేసినా ఆ రోడ్డు గురించి పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు.

కూటమి పాలకుల వాగ్దానాలు నీటి మీద రాతలే...

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రోడ్లన్నీ అభివృద్ధి చేస్తామని, నెయ్యి రోడ్డుపై ఒలికితే దాన్ని ఎత్తుకునే విధంగా అభివృద్ధి చేసి చూపుతామని పాలకులు చెప్పిన మాటలు నీటిమీద రాతలేనని అందుకు నిదర్శనమే ఈ రోడ్డు అని గ్రామస్తులు అవహేళన చేస్తున్నారు. అంబాపురం-రాజీవ్‌నగర్ రోడ్డును నిర్మించాలని, దాని ప్రాధాన్యతను తెలియచేస్తూ నిధులు మంజూరు చేయాలని అంబాపురం గ్రామ పంచాయతీ అనేక దఫాలు తీర్మానం చేసినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదు. పాలకులు పట్టించుకోవడం లేదని రెండు గ్రామాల ప్రజలు విమర్శిస్తున్నారు. కనీసం రోడ్డు గుంతలను పూడ్చాలని కోరుతున్నారు.

ఎవరైనా చనిపోతే మాకు చచ్చే చావు!



వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే ఆ గుంతల రోడ్డులో చనిపోయిన వ్యక్తి శవాన్ని చెక్కపెట్టిలో మోసుకెళ్లడానికి నానా అవస్థ పడుతున్నాం. నాలుగు రోజుల క్రితం అనిల్ కుమార్ అనే యువకుడు చనిపోతే గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు.

– గుజగంటి మోహనరావు, అంబాపురం

తక్షణం రోడ్డు నిర్మించాలి



చుట్టుపక్కల గ్రామాలకు ఈ రోడ్డు అవసరం ఎంతైనా వుంది. అంబాపురం-రాజీవ్‌నగర్ రోడ్డు నిర్మాణం యుద్ధ ప్రాతిపదికన నిర్మాణం చేయాలి. ఈ రోడ్డు నిర్మిస్తే అంబాపురం, పి.నైనవరం గ్రామాలతో పాటు సమీప గ్రామాల ప్రజలకు ఉపయోగకరం.

–పులి చంద్రపాల్, అంబాపురం

వినాయకుడి ఊరేగింపులో ఘర్షణ

- చోడవరంలో ఇరువర్గాల దాడులు
- డీజేపై వివాదం
- గ్రామంలో భగ్గుమన్న విభేదాలు

పెనమలూరు: చోడవరంలో గత కొద్ది రోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. గ్రామంలో ఆదివారం రాత్రి వినాయకుడి విగ్రహం ఊరేగింపు డీజేతో కొందరు యువకులు హడావుడి చేయటంతో మరో వర్గం అభ్యంతరం తెలిపింది. దీంతో వివాదం మొదలై పోలీసుల సమక్షంలోనే పరస్పర దాడులు చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే గ్రామంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామంలో హడావుడి ఎక్కువయింది. నాలుగు రోజుల క్రితం రజక కాలనీలోని వినాయకుడి విగ్రహం డీజే పెట్టి ఊరేగిస్తుండగా గ్రామంలో కొందరు టీడీపీ నేతలు అభ్యంతరం తెలిపారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగి డీజే తీయించారు. ఆ సందర్భంగా పోలీసులతో స్థానికులు గొడవపడ్డారు. ఆదివారం టీడీపీ నేతల మద్దతుతో రజక కాలనీలో మరో వర్గం వినాయకుడి విగ్రహం ఊరేగింపు డీజే పెట్టి చేశారు. దీనికి రజక కాలనీలో కొందరు అభ్యంతరం తెలిపారు. మా ఇళ్ల ముందు డీజే పెట్టవద్దన్నారు. తమ విగ్రహం ఊరేగింపులో డీజే తీయించిన పోలీసులు ఇప్పుడు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. దీంతో వివాదం రాజుకుంది. ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. పలువురికి గాయాలవటంతో ఆస్పత్రిలో చేరారు.

పోలీసుల ముందస్తు చర్యలు శూన్యం

చోడవరంలో వినాయకుడి విగ్రహాల ఊరేగింపులో గొడవలు జరిగే అవకాశం ఉన్నా పోలీసులు తగిన స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేయలేదని గ్రామస్తులు తెలిపారు. పైగా డీజేలే నిషేధమని పోలీసులు ప్రకటించి రాజకీయ ఒత్తిళ్లతో కొందరు డీజేలు పెట్టి గందరగోళం సృష్టించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో ఒక వర్గానికి చెందిన టీడీపీ నేతలు తమ ఆధిపత్యం కోసం యువతను రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రజక కాలనీలో దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేశామని సీఐ వెంకట రమణ తెలిపారు. గ్రామంలో ఎవరైనా ఘర్షణ వాతావరణం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విద్యుత్ రంగాన్ని కార్పొరేట్‌కు అప్పగించడం ప్రమాదకరం

గన్నవరం: ప్రభుత్వ అధీనంలో నడుస్తున్న విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించడం ప్రమాదకరమని యూటీఎఫ్ నేత కర్రా వరప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక అట్లూరి శ్రీమన్నారాయణ మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన స్టడీ సర్కిల్‌లో ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల ముందుగానే డబ్బులు కట్టి కరెంట్ వినియోగించుకోవాల్సి ఉంటుందన్నారు. దీనివల్ల ప్రజలపై మరింత విద్యుత్ భారాలు పడే అవకాశం ఉందన్నారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీనిలో భాగంగా స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియను అదాని సంస్థకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఐలూ నాయకుడు అనుమోలు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నున్న గ్రామంలో విజిలెన్స్ తనిఖీలు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పీఏసీఎస్ సొసైటీ ద్వారా విక్రయిస్తున్న ఎరువులను విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ఉదయం నుంచి సొసైటీ గోడౌను వద్ద ఎరువుల కోసం పడిగాపులు పడినా ఎరువులు విక్రయించక పోవడంతో రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. సాయంత్రం విజిలెన్స్ డీఎస్పీ యు.బంగార్రాజు, ఏఓ కిరణ్ ఆకస్మికంగా వచ్చి గోదాములోని ఎరువులను తనిఖీ చేశారు. విజిలెన్స్ అధికారులు స్టాకును పరిశీలించిన పిమ్మట ఎరువులను ఏ విధంగా విక్రయిస్తున్నారనే వివరాలను సొసైటీ సీఈఓ తాడంకి రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. సొసైటీకి 15 టన్నుల యూరియా వచ్చిందని ఎకరానికి అరబస్తా చొప్పున రైతుల పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డును బట్టి విక్రయిస్తున్నట్లు తెలియజేశారు. యూరియాతో పాటు 20:20:0:15, డీఏపీ, 14:35, పొటాష్, 10:26, ఎరువుల నిల్వల రికార్డులను విజిలెన్స్ అధికారులు పరిశీలించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏడీఏ బి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విజయవాడ రూరల్ మండలంలో యూరియా కొరత లేదన్నారు. సీజన్ చివరి వరకు ఎరువులను సరఫరా చేస్తామన్నారు. ఏడీఏతో పాటు మండల వ్యవసాయాధికారి కె.రఘురామ్ తదితరులున్నారు.



నున్న సొసైటీ గోడౌన్లో ఎరువులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రెస్టారెంట్లలో తనిఖీ చేసిన కమిషనర్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ రెస్టారెంట్‌లను మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ సోమవారం తనిఖీ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక రెస్టారెంట్‌లు ఉండగా వాటిని ఎవరూ తనిఖీ చేయటం లేదు. దీంతో ఆహార పదార్థాల నాణ్యత, కిచెన్‌లో ఉంచిన ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయి, ప్రధానంగా మాంసాహారం తాజాగా ఉందా లేదా అనే విషయమై కమిషనర్ తన తనిఖీల్లో పరిశీలించారు. కొన్ని రెస్టారెంట్లలో కిచెన్‌లో పరిశుభ్రత సక్రమంగా లేక పోవటాన్ని గుర్తించారు. రెస్టారెంట్‌ల నిర్వాహకులు పూర్తిస్థాయిలో నాణ్యత పాటించాలని, నిల్వ ఆహార పదార్థాలు అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని కమిషనర్ నజీర్ యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.



కానూరులో రెస్టారెంట్లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ నజీర్

గన్నవరం: ఉంగుటూరు మండలంలో విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం తేలప్రోలు, బండారుగూడెం గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు గృహ, వాణిజ్య, పరిశ్రమలు, వ్యవసాయ కనెక్షన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుడివాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేబీ శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఘనంగా ఎల్‌ఐసీ వార్షికోత్సవం



గన్నవరం: స్థానిక ఎల్‌ఐసీ శాటిలైట్ బ్రాంచ్ కార్యాలయంలో సోమవారం ఆ సంస్థ 69వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను బ్రాంచ్ మేనేజర్ జేఎస్ శ్రావణ్‌కుమార్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో బిజినెస్ పరంగా మచిలీపట్నం డివిజన్‌లో గన్నవరం బ్రాంచ్ కీలకపాత్ర వహించినట్లు చెప్పారు. దీనికి కారకులైన బ్రాంచ్ సిబ్బందిని, ఏజెంట్లను ఆయన అభినందించారు. ముగ్గురు ఎల్‌ఐసీ ఏజెంట్లు అత్యధిక పాలసీలు చేసి అమెరికాలో జరిగే ఎండీఆర్‌టీ సమావేశానికి అర్హత సాధించినట్లు తెలిపారు. బ్రాంచ్ ఆఫీసర్ వీఎస్ కుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు రవీంద్రనాథ్, అప్పలనాయుడు, జయప్రకాష్‌నారాయణ, హనుమంతరావు, ఎల్‌ఐసీ ఏఓఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.అచ్యుతరావు, ఎల్‌ఐఏఎఫ్‌ఐ నాయకులు పీవీవీఎస్ఎన్ ప్రసాద్, పలువురు ఏజెంట్లు పాల్గొన్నారు.

పసుపు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



కంకిపాడు: పసుపు సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి అన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలో పసుపు పంట పొలాలను, వ్యవసాయ క్షేత్రాలను ఉద్యానశాఖ అధికారులు, రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ సాగులో శాస్త్రీయపరమైన మెలకువలు పాటించాలన్నారు. చీడ పీడలను సకాలంలో గుర్తించి యాజమాన్య చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా దుంప కుళ్లు నివారణకు రైతులు యాజమాన్య చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ వి.మంజువాణి, ఉద్యానశాఖ అధికారి డాక్టర్ హర్‌చంద్, వీఏఏ కల్యాణ్, మద్దూరు, కాసరనేనివారిపాలెం సర్పంచ్‌లు చిప్పల రామదాసు, పి.వరప్రసాద్, స్థానిక రైతులు పాల్గొన్నారు.

గణనాథా... మము బ్రోవుమయా!



ఉయ్యూరు సుందరమ్మపేటలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన గణనాథుడు



ఉయ్యూరు చింతలతోటలో గణనాథుడి సేవలో ఉత్సవ కమిటీ

ఉయ్యూరు: వినాయక చవితి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. చింతలతోట, సుందరమ్మపేటలో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి కొలువుతీర్చిన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. నాగ పడగల ఆకారంలో కొలువుదీరిన గణనాథుడికి చింతల తోటలో వేలాది మంది భక్తులు విశేష పూజా కార్యక్రమాలు జరిపిస్తున్నారు. సోమవారం 5 వేల మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. సుందరమ్మపేటలో కనురెప్పలు ఆడిస్తూ ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన గణనాథుడిని భక్తులు పూజించి తరించారు. నిత్యం మండపాల్లో భక్తిపూర్వక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో ఉయ్యూరులో ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఉచిత హోమియో వైద్య శిబిరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: దీర్ఘకాలిక వ్యాధులను ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా హోమియో వైద్యం ద్వారా పూర్తిగా నయం చేయవచ్చని ప్రముఖ హోమియో వైద్యురాలు దుభాషి సుభాషిణి అన్నారు. స్థానిక ఏలూరు రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండలంలో ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. కిడ్నీ, వెన్నునొప్పి, తలనొప్పి, సైనసైటిస్, అస్తమా, గ్యాస్ ట్రబుల్, థైరాయిడ్, సయాటికా, మధుమేహం, చర్మ వ్యాధులకు ఈ శిబిరంలో డాక్టర్ సుభాషిణి సుమారు 100 మంది రోగులకు ఉచితంగా వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సుభాషిణి

శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో గణపతి నవరాత్రులు

గన్నవరం: స్థానిక శ్రీకాశీ విశాలాక్షి అన్నపూర్ణదేవి సహిత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో గణపతి నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం కాసన్నేని రాజామణీంద్ర, వెంకటపద్మప్రియ దంపతులు స్వామివారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిపారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో గణనాథుడికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక యాదవులపేటలో గణనాథుడికి సోమవారం ఘనంగా నిమజ్జన వేడుక జరిపారు. స్థానిక రాయ్‌నగర్, కేసరపల్లి, బుద్ధవరం, మర్లపాలెం, దావాజిగూడెం గ్రామాల్లో గణపతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

6న కొబ్బరిచిప్పల వేలం

పెనమలూరు: యనమలకుదురు లాకుల వద్ద ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఈ నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు కొబ్బరి చిప్పలకు బహిరంగ వేలంపాట నిర్వహించనున్నామని ఆలయ కార్య నిర్వహణాధికారి యూవీ ప్రసాదరావు తెలిపారు. ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ ఈ ఏడాది సెప్టెంబర్ 10వ తేదీ నుంచి 2027 వ సంవత్సరం సెప్టెంబర్ 9వ తేదీ వరకు రెండేళ్ల పాటు కొబ్బరి చిప్పల సేకరణకు లైసెన్స్ హక్కులకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తామన్నారు. వేలం పాట దేవదాయ, ధర్మదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తామన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఉయ్యూరు: ఆర్థిక అక్షరాస్యతను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు అన్నారు. ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉయ్యూరు శ్రీ శ్రీనివాసా విద్యాసంస్థల్లో సోమవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై సీఐ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇండియన్ బ్యాంక్ బీఎం అజయ్ కుమార్, యూనియన్ బ్యాంకు బీఎం రాహుల్ సుభాష్, విద్యాసంస్థల అధినేత పరుచూరి శ్రీనివాసరావు, న్యాయవాది గోపీచంద్ పాల్గొన్నారు.